

తడిసిముద్దయిన అనకాపల్లి

భారీ వర్షం అనకాపల్లిని కుదిపేసింది. గురువారం సాయంత్రం 57 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. 8లో



స్వచ్ఛతకు 'ఒక్కటి' అవుదాం

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు మెరుగుదలకు జీవీఎంసీ కృషి చేస్తోంది. పరిశుభ్రతపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభించింది. 8లో



ఘనంగా వెంకన్న కల్యాణం

సింహాచలం: వెంకటాద్రిపై గురువారం స్వామివారి కల్యాణోత్సవం జీలకర్రబెల్లం, మాంగల్యధారణతో ఘనంగా జరిగింది.

దూసుకుపోతున్న మహిళా మార్ట్

దద్దరిల్లుతున్న బహిరంగ మార్కెట్

దినదినాభివృద్ధి దిశగా..

- రోజుకు రూ.లక్షకు పైగా విక్రయాలు
- సబ్బవరం మహిళా మార్ట్‌కు రాష్ట్రంలో మూడో స్థానం
- డోర్ డెలివరీ, డిస్కౌంట్ సేల్స్, గిఫ్టులు వంటి ఆకర్షణీయ పథకాలు



సబ్బవరం మహిళా మార్ట్‌లో సరకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

తుమ్మపాల: రోజుకు కనీసం లక్ష.. అంతకంటే పైనే అమ్మకాలు చేస్తూ దూసుకుపోతున్నాయి వైఎస్సార్ చేయూత మహిళా మార్టులు. జిల్లాలో మొదటిగా మాడుగులలో శ్రీకారం చుట్టగా.. రెండో మహిళా మార్ట్‌ను సబ్బవరంలో గత నెల 15న ప్రారంభించారు. మొదటి రోజు రూ.80 వేల విలువైన సరకుల అమ్మకాలు జరగగా.. రోజురోజుకు రెట్టింపు వేగంతో విక్రయాలు పెరుగుతున్నాయి. మాడుగుల మార్ట్‌ను డిసెంబరులో ప్రారంభించారు. కొత్తలో రోజుకు సుమారు రూ.30 వేల వరకు అమ్మకాలు సాగేవి. ఇప్పుడవి సగటున రోజుకు రూ.లక్షా 30 వేలకు చేరుకున్నాయి. సబ్బవరం మార్ట్ కూడా నెల రోజులు పూర్తి కాకుండానే రికార్డులు సృష్టించే దశకు చేరుకుంది.

ఆకర్షణీయమైన పథకాలు

సబ్బవరం మార్ట్‌లో వినూత్నమైన పథకాలతో కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు. ఎక్కువ వస్తువులు కొనుగోలు చేసిన వారికి డోర్ డెలివరీ, కనీసం రూ.వెయ్యి, ఆపైన కొనుగోలు చేసిన వారికి బహుమతులు, మార్కెట్ ధరలతో పోల్చితే ప్రతి వస్తువుపైనా కనీసం 5 శాతం డిస్కౌంట్ అందిస్తున్నారు. నాణ్యమైన వస్తువులు అందించడంతో డిమాండ్ పెరిగింది. పప్పు దినుసులను బల్క్‌లో కొనుగోలు చేసి కేజీ ప్యాకేజీలతో చేయూత లోగోతో నేరుగానే



పప్పుదినుసుల ప్రత్యేక ప్యాకింగ్

విక్రయిస్తున్నారు. జీడి గుండు పప్పును కొనుగోలు ధరకే అమ్మడంతో అతి తక్కువ కాలంలోనే ఖాతాదారుల మన్ననలు పొందుతూ దినదినాభివృద్ధి చెందుతోంది.

రికార్డుల మోత

గత నెల 15వ తేదీన సబ్బవరంలో ప్రారంభించిన వైఎస్సార్ చేయూత మహిళా సూపర్ మార్ట్ ఇంతవరకు రూ.22 లక్షల అమ్మకాలు చేసింది. సగటు అమ్మకాలు రోజుకు రూ.92 వేలుగా నమోదైంది. ఈ నెల 6వ తేదీన అత్యధికంగా రూ.1,46,731ల అమ్మకాలతో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ఉన్న 36 సూపర్ మార్ట్‌ల అమ్మకాల్లో సబ్బవరం మార్ట్ గడిచిన పది రోజుల్లో మొత్తంగా మూడవ స్థానంలో నిలిచింది.

ప్రత్యేక ఆఫర్లతో ఆకర్షిస్తూ..

జిల్లాలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యుల చందాలతో ఏర్పాటు చేసిన సబ్బవరం, మాడుగుల సూపర్ మార్ట్‌లలో అమలు చేస్తున్న ప్రత్యేక ఆఫర్లు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. మార్ట్‌లో కొనుగోలు చేసిన వస్తువులకు



బహుమతులు అందుకుంటున్న కొనుగోలుదారులు

5 నుంచి 10 శాతం డిస్కౌంట్ ఇస్తున్నారు. ఈ ధర మార్కెట్ ధర కన్నా తక్కువగానే ఉంది. ఎక్కువ వస్తువులు కొనుగోలు చేసిన వారికి డోర్ డెలివరీ సౌకర్యం ఇస్తున్నారు. మాడుగుల మార్ట్ పరిధిలో మాడుగుల, చీడికాడ మండలాలు, సబ్బవరం మార్ట్ పరిధిలో సబ్బవరం, కె.కోటపాడు, పరవాడ మండలాలకు డోర్ డెలివరీ సౌకర్యం ఉంది. ప్రతి వెయ్యి రూపాయల కొనుగోలుపై ఒక కేజీ ప్లాస్టిక్ డబ్బా, రూ.1,500 కొనుగోలుపై బౌల్ సెట్, రూ.2,500 కొనుగోలుపై గాజు గ్లాస్ సెట్, రూ.3,500 కొనుగోలుపై గ్లాస్, మగ్‌సెట్ బహుమతులుగా అందిస్తున్నారు.

పప్పు దినుసులకు చేయూత ప్యాకేజీ

నాణ్యమైన కిరాణా సరకులను హోల్‌సేల్‌గా బల్క్‌లో కొనుగోలు చేసి ప్యాకింగ్ చేస్తున్నారు. వాటిని నేరుగా మార్ట్‌ల ద్వారా విక్రయించి లాభాలను మహిళా సభ్యులకు పంచే విధంగా ప్రణాళిక చేశారు. జీడీపప్పు (గుండుపప్పు) మొదటి రకాన్ని కొనుగోలు చేసిన ధరకే నేరుగా వినియోగదారులకు అమ్మేస్తున్నారు. జీడిపప్పు జిల్లాలోని గొలుగొండ వంటి ప్రాంతాల నుంచి నేరుగా మార్ట్‌లకు తరలించడంతో వ్యయప్రయాసలు లేవంటున్నారు.

మంచి ఫలితాలు వస్తున్నాయి



జిల్లాలో ఏర్పాటు చేసిన మాడుగుల, సబ్బవరం మహిళా మార్ట్‌లు మంచి ఫలితాలు సాధిస్తున్నాయి. సబ్బవరం మార్ట్‌లో రోజు రోజుకు అమ్మకాలు పెరిగి రూ.లక్ష నుంచి లక్షా యాభై వేల మధ్య అమ్మకాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఉన్న 36 సూపర్ మార్ట్‌ల అమ్మకాల్లో సబ్బవరం మార్ట్ గడిచిన పది రోజుల్లో మొదటి, మూడవ స్థానంలో నిలిచింది.

–బి.లక్ష్మీపతి, డీఆర్‌డీఏ పీడీ

నాణ్యమైన సరకులు తక్కువ ధరకు..



సబ్బవరం మార్ట్ ఏర్పాటులో 1,757 మహిళా సంఘాల్లోని 18,729 మంది సభ్యుల ద్వారా సమకూరిన రూ.37,45,800తో పాటు ప్రభుత్వం అందించిన చేయుతతో గత నెల 15 న మార్ట్ ప్రారంభమైంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉండటంతో ఈ మార్ట్ మంచి ఫలితాలు సాధిస్తోంది. ఈ మార్ట్‌లో కేవలం ఐదుగురు సభ్యులు మాత్రమే పనిచేస్తున్నారు.

– సిహెచ్.వరప్రసాద్, డీఆర్‌డీఏ డీపీఎం

త్వరలో మరో నాలుగు మహిళా మార్ట్‌లు

- జిల్లాలో లక్ష పండ్ల మొక్కల పంపిణీ
- డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి



కె.కోటపాడులో మొక్కలను నాటుతున్న పీడీ లక్ష్మీపతి, ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు : జిల్లాలో డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో మాడుగుల, సబ్బవరంలలో మహిళా మార్ట్‌ల ఏర్పాటు జరిగిందని డీఆర్‌డీఏ పీడీ బి.లక్ష్మీపతి అన్నారు. కె.కోటపాడులో గల ఐకేపీ ఏపీఎం, సీసీలతో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌తో కలిసి గురువారం ఆయన సమావేశం జరిపారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జిల్లాలో చోడవరం, మాకవరపాలెం, అనకాపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో డ్వాక్రా మహిళలతో మహిళా మార్ట్‌ల ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 26 జిల్లాలో 36 మహిళా మార్ట్‌లు ఏర్పాటు కాగా వీటిలో ఇప్పటికే అనకాపల్లి జిల్లాలో రెండు ఉన్నాయన్నారు. మహిళా మార్ట్‌లలో నాణ్యమైన వస్తువులు తక్కువ ధరలకే అందుబాటులో ఉండనున్నాయన్నారు. ఇప్పటికే గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లాలో లక్ష పండ్ల మొక్కలను తక్కువ ధరలకే డ్వాక్రా సంఘాల్లో గల మహిళా సభ్యులకు అందించినట్టు లక్ష్మీపతి తెలిపారు. జిల్లాలో గల 3,62,940 డ్వాక్రా సంఘాల్లో మహిళలకు ఈ పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా కల్పించామన్నారు. 16,573 మందికి రూ.83.73 కోట్ల స్త్రీనిధి రుణాన్ని మంజూరు చేయడం జరిగిందని లక్ష్మీపతి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా కొబ్బరి, మామిడి మొక్కలను ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌తో కలిసి ఆయన నాటారు.

న్యూస్‌రీల్

దాతల తోడ్పాటుతో మరింత విద్యాభివృద్ధి

ఆర్‌జేడీ జ్యోతికుమారి



విద్యార్థులకు వైట్ షూ అందజేస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి

నర్సీపట్నం: విద్యాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు (ఆర్జేడీ) ఎం.జ్యోతికుమారి పేర్కొన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ, వెంకునాయుడుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్, పూర్వవిద్యార్థులు సమకూర్చిన రూ.20 వేల విలువైన వైట్ షూలను 80 మంది విద్యార్థులకు ఆమె అందజేశారు. ప్రభుత్వం పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. ప్రభుత్వ కృషికి దాతలు తోడ్పాటును అందిస్తే విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. నాడు-నేడు పనుల పట్ల ఆర్జేడీ సంతృప్తి వ్యక్తం చేశారు.

పాడి రైతుల మన్ననలు పొందేలా సేవలు

ప్రోగ్రాం జిల్లా మేనేజర్ శ్రీనివాస్



సంచార వాహనంలో లిఫ్టును పరిశీలిస్తున్న 1962 ప్రోగ్రాం జిల్లా మేనేజర్ శ్రీనివాస్

నర్సీపట్నం: పాడిరైతుల మన్ననలు పొందేలా సేవలు అందించాలని డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్య సేవల 1962 ప్రోగ్రాం జిల్లా మేనేజర్ శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలోని సంచార పశు వైద్య సేవల వాహనాలు, సిబ్బంది పనితీరుపై గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రోజుకు ఎన్ని పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారని ఆరా తీశారు. రోజూ 8 నుంచి 10 పశువులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు సిబ్బంది మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. సంచార వాహనంలో లిఫ్టును పరిశీలించారు. ఆస్పత్రి పరిధిలో పశువులకు అందిస్తున్న వైద్య సేవలను ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు మేనేజర్‌కు వివరించారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో సంచార వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని మేనేజర్ తెలిపారు. సబ్ డివిజన్‌లో అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. మరింత ఉత్సాహంతో సిబ్బంది పాడిరైతులకు వైద్య సేవలు అందించాలన్నారు. పశువులకు ఎలాంటి ఇబ్బంది వచ్చిన 1962 ఫోన్ కాల్ చేస్తే తమ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సేవలు అందిస్తారన్నారు. ఆయన వెంట వెటర్నరీ డాక్టర్లు జి.యమున, కె.హరిత, ఎం.అశోక్ ఉన్నారు.

15న 50 వేల మొక్కలు నాటుదాం

నర్సీపట్నం ఆర్డీవో జయరాంకు రాంబాబు మాస్టారు ఆహ్వానం



ఆర్డీవో జయరాంకు మొక్క అందిస్తున్న వృక్షమిత్ర వ్యవస్థాపకుడు రాంబాబు

రోలుగుంట: ''గ్రీన్ మిలియన్''లో భాగంగా రోలుగుంట మండలంలో 50 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఈ నెల 15న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని నర్సీపట్నం ఆర్డీవో హెచ్.జయరాంను వృక్షమిత్ర వ్యవస్థాపకుడు అప్పన రాంబాబు మాస్టారు గురువారం కలిశారు. ఇప్పటికే నర్సీపట్నం, నాతవరం, రోలుగుంట మండలాల్లో తురాయి, నేరేడు, వేప, గన్నేరు తదితర జాతులకు చెందిన లక్ష మొక్కలను నాటించడం, వాటి సంరక్షణ బాధ్యతలు ఆసక్తి కలిగిన వలంటీర్లతో నిర్వహించామన్నారు. మరలా ఇప్పుడు 50 వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు వివరించారు.

త్వరలో ఏలేరు తాండవ అనుసంధానం

- రెండు నెలల్లో భూసేకరణ పూర్తి
- ఎత్తిపోతల పథకం పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం
- ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్, అధికారులు



కాలువల ద్వారా పంటపొలాలకు చేరుతున్న తాండవ జలాలు

నాతవరం : ఏలేరు, తాండవ ప్రాజెక్టుల అనుసంధానం పనులు రెండు నెలలు తర్వాత ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. తాండవ ప్రాజెక్టు నిర్మాణం నుంచి వస్తున్న సంప్రదాయం ప్రకారం గట్టు దిగువనున్న వినాయకుడు, శ్రీనల్లకొండమ్మతల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గేట్లు ఎత్తి ఖరీఫ్ సాగుకు నీటిని కాలువలోకి విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండు జిల్లాల పరిధిలో వేలాది మంది రైతులకు జీవనాధారమైన తాండవ ప్రాజెక్టు ఆయకట్టుకు పుష్కలంగా నీరు అందించేందుకు దృష్టి సారించారన్నారు. ఏలేరు తాండవ ప్రాజెక్టుల అనుసంధానం కోసం రూ. 470 కోట్ల 5 లక్షలు మంజూరు చేసి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందేన్నారు. ఏలేశ్వరం ప్రాజెక్టు అధికారుల ఆధ్వర్యంలో భూసేకరణ పనులు జరుగుతున్నాయన్నారు. భూసేకరణతో పాటు సాంకేతిక పరమైన అంశాలు రెండు నెలల్లో పూర్తి కానున్నాయన్నారు. అనుసంధానం పనులు పూర్తయితే రెండు జిల్లాల పరిధిలో వేలాది ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతాయన్నారు. డీఈ స్వామినాయుడు మాట్లాడుతూ తాండవ ప్రాజెక్టులో ప్రస్తుతం 370.2 అడుగులు నీరు ఉందన్నారు. ఈ నీటిని రోజుకు రెండు ప్రధాన కాల్వలతో పాటు తాండవ నదిలోకి 375 కూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నామన్నారు. నీటిని రైతులంతా పొదుపుగా వాడుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో నాతవరం కోటనందూరు ఎంపీపీలు సాగిన లక్ష్మణమూర్తి, లగుడు శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స వైస్ ఎంపీపీలు సునీల్, మైనం శ్రీనాగగోపి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సూకరాజు, పామాయిల్ కార్పొరేషన్ కాపు కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు పోతురాజు శిరుసుపల్లి నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి గొర్లె వరహాలబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెంకునాయుడు, ఉలబాల శ్రీను, అప్పలరాజు, కోటనందూరు పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి జి.రామచంద్రరాజు, జేఈలు రామకృష్ణ శ్యామ్‌కుమార్, వినయ్‌కుమార్, రవికుమార్, పాత్రుడు, నాగబాబు పాల్గొన్నారు.

రూ.3.50 కోట్ల తాండవ రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు

నాతవరం పంచాయతీ నుంచి తాండవ రిజర్వాయరు మధ్య తారురోడ్డు అభివృద్ధికి రూ.3.50 కోట్లు ప్రతిపాదనలు పంపించామని తాండవ ప్రాజెక్టు డీఈ జె.స్వామినాయుడు అన్నారు. భారీ వర్షాలకు శిథిలమైన తాండవ ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి నిధుల ప్రతిపాదన చేశామన్నారు.

తాండవ రిజర్వాయరు పరిధిలో కాల్వలు, వంతెనల మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ.6.70 కోట్లు మంజూరు చేయగా అవి టెండర్ల దశలో ఉన్నాయన్నారు. రూ.70 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. తాండవ ప్రాజెక్టు ప్రధాన గేట్ల మరమ్మతులకు రూ.9.50 లక్షలు మంజూరయ్యాయన్నారు.

మారణహోమమే చంద్రబాబు లక్ష్యం

- ప్రాజెక్టుల సందర్శన పేరుతో టీడీపీ గూండాగిరీ
- ప్రసంగాలతో పవన్ కల్యాణ్ రెచ్చగొట్టే యత్నం
- ఛీదరించుకుంటున్న ప్రజానీకం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



విలేకర్లతో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

నక్కపల్లి: ప్రాజెక్టుల సందర్శన పేరుతో రాష్ట్రంలో అల్లర్లు, అరాచకాలు సృష్టించి శాంతిభద్రతల సమస్య తీసుకురావాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆరోపించారు. గురువారం ఆయన పాయకరావుపేటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు పాల్గొనే పర్యటనలు, సమావేశాల్లో టీడీపీ గూండాలను రంగంలోకి దించుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన చంద్రబాబు సానుభూతి కోసం ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. శాంతిభద్రతలను కాపాడుతున్న పోలీసులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ గూండాలతో దాడులు చేయించి చంపించే ప్రక్రియకు పుంగనూరు నుంచి శ్రీకారం చుట్టారన్నారు. ఇటువంటి కుట్రలు, కుతంత్రాలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దాదాపు రూ.2.40 లక్షల కోట్లను డీబీటీ ద్వారా పలు సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. మళ్లీ రాజన్న బిడ్డనే ముఖ్యమంత్రిగా చూడాలని, రాష్ట్రంలో 2024లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. దీనిని జీర్ణించుకోలేని చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. ప్రజలను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారన్నారు. అజెండా లేకుండా ఎన్నికల బరిలోకి దిగిన పవన్‌ను ప్రజలు రెండు చోట్ల తిరస్కరించారన్నారు. తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పకుండా పవన్ కల్యాణ్, లోకేషులు మొదటి నుంచీ జగన్‌మోహన్‌రెడ్డిని దూషించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వారి ప్రసంగాలను ప్రజలు ఛీత్కరించుకుంటున్నారన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పీఏసీఎస్ అధ్యక్షుడు రాజేష్‌ఖన్నా, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



బాలికతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, డీఎంహెచ్‌వో హేమంత్

దేవరాపల్లి: చిన్నారుల్లో నులి పురుగుల నిర్మూలనతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువ, నాగయ్యపేట గ్రామాల్లో గురువారం జరిగిన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం (డీ వార్మింగ్ డే)లో ఆయన పాల్గొన్నారు. తారువ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, నాగయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలను ఆయన మింగించారు. పేగుల్లో నులి పురుగులు చేరడంతో రక్తహీనత, పోషకాహార లోపం, బలహీనత, కడుపునొప్పి, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, వికారం తదితర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఏడాది వయసు చిన్నారి నుంచి 19 ఏళ్ల వయసు పిల్లలంతా తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేసుకునేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో బాలాజీ, ప్రోగ్రాం ఆఫీసర్ డా.కిశోర్, వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.హారిక, ఎంపీడీవో వంటాకు పైడితల్లమ్మ పాల్గొన్నారు.

జిల్లాలో 3,16,206 మందికి ఆల్బెండజోల్ మాత్రలు

తుమ్మపాల: ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేయడం వల్ల నులి పురుగుల వల్ల వచ్చే దుష్ప్రభావాలను, రక్తహీనతను నివారించవచ్చని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. పట్టణంలో జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బాలబాలికలతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. జిల్లాలో 3,16,206 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు చెప్పారు. మిగిలిపోయిన బాలబాలికలకు ఈ నెల 17వ తేదీన మాత్రలను అందిస్తామని చెప్పారు.

డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, డీపీఎంవో డాక్టర్ లూసి కార్డిలియా, డాక్టర్ కె.నీరజ, కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేరగాడితో టీడీపీ నేతల వికృత క్రీడ

- సంతోష్ పలు కేసుల్లో నిందితుడు
- గతంలో పోలీసులపై తిరగబడిన చరిత్ర
- తాజాగా ఎస్టీ యువతిపై లైంగిక దాడి కేసు
- నారా లోకేష్ ప్రోద్బలంతో చిత్తూరు ఎస్పీపై సంతోష్ ఆరోపణలు
- టీడీపీ నైజం బయటపడిందంటున్న విమర్శకులు



సంతోష్ అప్పట్లో ధ్వంసం చేసిన పోలీసు వాహనం



మద్యం మత్తులో ఉన్న సంతోష్‌ను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న అప్పటి ఎస్సై శ్రీను

సాక్షి, విశాఖపట్నం: నేర స్వభావం కలిగిన ఎల్లేటి దుర్గా సంతోష్ ఐపీఎస్ అధికారిపై ఆరోపణలు చేయడంతో సభ్య సమాజం తలదించుకుంటోంది. రేపిస్టు అయిన సంతోష్ ఆరోపణలను పచ్చపత్రిక ప్రచురించడం విడ్డూరంగా ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో అరాచకాలకు పాల్పడిన వ్యక్తి ఆ జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డిపైనే మాటల దాడి చేయడం విడ్డూరంగా ఉంది. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన సంతోష్ నేర చరిత్ర చాలా సుదీర్ఘమైనది. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, ఆయన తనయుడు విజయ్ అండదండలతో మరికొంతమంది అల్లరి మూకలతో కలిసి అనేక నేరాలకు పాల్పడినట్టు అతనిపై కేసులు ఉన్నాయి. 2019లో రిషాంత్‌రెడ్డి నర్సీపట్నం ఏఎస్పీగా పనిచేశారు. ఏఎస్పీ ఆదేశాలతో అప్పటి పోలీసు సిబ్బంది పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు నడుం బిగించారు. నేరస్వభావం కలిగిన సంతోష్, అతని సహచరులకు అది రుచించలేదు. ఎస్సై శ్రీను, సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం సేవించి సంతోష్, రౌడీషీటర్లు పట్టుబడ్డారు. విధి నిర్వహణలో ఉన్న ఎస్సైపై జులుం ప్రదర్శించడమే కాకుండా పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసి, ఎస్సైపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. క్రైమ్ నెంబరు 401/2019 యు/ఎస్ 307, 353, 427/34 ఐపీసీ సెక్షన్ల కింద సంతోష్‌పై కేసు నమోదు చేశారు. అదే సమయంలో పోలీసు కస్టడీ నుంచి సంతోష్ పరారు కావడంతో క్రైమ్ నెంబరు 402/2019 యు/ఎస్ 224 ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఎస్టీ అమ్మాయిపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న అభియోగంతో అతనిపై ఇటీవల క్రైమ్ నెంబరు 27/2023 యు/ఎస్ 376, 417,ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టై, కొద్ది రోజుల క్రితమే బెయిల్‌పై బయటికి వచ్చాడు. ఇన్ని నేరాలకు పాల్పడిన సంతోష్‌ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పక్కన కూర్చోబెట్టుకొని పుంగనూరు ఘటన నేపథ్యంలో ఐపీఎస్ అధికారిపై తప్పుడు ఆరోపణలు చేయించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. నిందితుడి చేత నిబద్ధత కలిగిన పోలీసు ఆఫీసర్‌పై ఆరోపణలు చేయించడంతో టీడీపీ నాయకుల నైజం బయటపడిందంటున్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: కటక్-కందర్పూర్ మధ్య నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు కారణంగా.. ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈనెల 14న టాటానగర్-విశాఖపట్నం(20815) ఎక్స్‌ప్రెస్ వయా కిషన్‌గంజ్, సాలాగావ్, నారాజ్ మార్తపూర్, బారగడ్ రోడ్‌ల మీదుగా నడుస్తుంది. కిషన్‌గంజ్, నారాజ్ మార్తాపూర్‌లలో తాత్కాలిక హాల్ట్ కల్పించారు. శుక్రవారం అగర్తలా-సికింద్రాబాద్(07029) ఎక్స్‌ప్రెస్ వయా కిషన్‌గంజ్, సాలాగావ్, నారాజ్ మార్తపూర్, బారగడ్ రోడ్‌ల మీదుగా నడుస్తుంది.



గానామృతం కురిసిన వేళ..




దేశభక్తి గీతాలను ఆలపిస్తున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్/అనకాపల్లి రూరల్: దేశభక్తి ఉప్పొంగింది.. గానామృతం మధువులొలికించింది.. బాలలు పాడిన పాటలు ఆహూతులను అలరించాయి. పట్టణంలోని వేల్పులవీధి జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో 76వ స్వాతంత్య్ర దినోత్సవాల్లో భాగంగా గురువారం దేశభక్తిపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, వైద్యుడు కాండ్రేగుల విష్ణుమూర్తి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఆలపించిన దేశభక్తి గీతాలు పరవశింపజేశాయి. విజేతలకు ఈనెల 15వ తేదీన ట్రస్ట్ ఆవరణలో బహుమతులు అందజేస్తారు. పాఠశాల హెచ్ఎం టి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అమరుల ప్రాణత్యాగం నిత్య స్మరణీయం

అనకాపల్లి రూరల్: దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుల్ని నిత్యం స్మరించుకోవాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. తగరంపూడిలో గురువారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ఉత్సవాల్లో భాగంగా నా భూమి–నా దేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శిలా ఫలకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశం పట్ల గౌరవభావంతో మెలగాలన్నారు. దేశ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. భావితరాల్లో స్ఫూర్తినింపడానికి అమర వీరుల త్యాగాలను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఈవోపీఆర్డీ కె ధర్మారావు, నరేగా ఏపీవో సుప్రియ, ఈసీ రమణాజీ, రూరల్ ఎస్సై నర్సింగరావు ,గ్రామ సర్పంచ్ యాదగిరి అప్పారావు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు

స్వచ్ఛతకు 'ఒక్కటి' అవుదాం

- స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు మెరుగుకు కృషి
- ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభం
- 15వ తేదీలోగా కేంద్ర బృందం ఆకస్మిక తనిఖీలు

అనకాపల్లి టౌన్: ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో విశాఖ జీవీఎంసీని ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. గతేడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీ నాలుగో ర్యాంక్ సాధించగా, ఈ ఏడాది మొదటి ర్యాంక్ కోసం అనకాపల్లి జోన్ పరిధిలో అన్ని విభాగాల అధికారులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమానికి కేంద్ర బృంద సభ్యులు జోనల్ పరిధిలో ఏ ఒక్క అధికారికి తెలియకుండా అనకాపల్లిలో వివిధ ప్రాంతాలను పరిశీలించి, మార్కులు వేసి వెళ్లిపోతారు. విశాఖ జీవీఎంసీ పరిధిలో అన్ని జోన్లలో పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలు ఆధారంగా ర్యాంకులు అందజేస్తారు. ఈనెల 15వ తేదీలోగా ప్రజా అభిప్రాయ సేకరణ కేంద్ర ఇచ్చిన యాప్‌లో నమోదు చేసుకోవాలి.

స్వచ్ఛ సర్వేక్షణ్ నిబంధనలు...

ఏటా మార్చి మాసంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు పర్యటిస్తారు. కరోనా వంటి విపత్తుల కారణంగా కేంద్ర బృందం ఆగస్టు 15వ తేదీ వరకూ పొడిగించింది. మరో వారం రోజుల్లో ఎప్పుడైన అకస్మాత్తుగా బృంద సభ్యులు వచ్చి పట్టణంలో పలు ప్రాంతాలను పరిశీలించే అవకాశాలు ఉన్నాయి. పబ్లిక్ హెల్త్ సిబ్బంది పట్టణాన్ని పరిశుభ్రంగా చేపడుతున్నారు. ప్రధానంగా పరిసరాల పరిశుభ్రత, డ్రైనేజీ క్లీనింగ్, రోజువారి చెత్త (తడి,పొడి) సేకరణ, ప్లాస్టిక్ వినియోగం, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ వంటి అంశాలపై క్షుణంగా పరిశీలిస్తారు. వీటి ఆధారంగా ప్యారామీటర్స్‌లో 24 అంశాలపై పరిశీలించి ర్యాంకింగ్ అందజేస్తారు. అనకాపల్లి జోన్ 23 కిలోమీటర్ల మేర పరిధిలో విస్తరించి ఉంది. 120 కిలోమీటర్ల మేర చిన్న, మధ్య డ్రైనేజీలు ఉండగా 15 కిలోమీటర్ల మేర పెద్ద డ్రైనేజీలు ఉన్నాయి. రోజుకు 90–100 టన్నుల చెత్తను జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు పట్టణంలో సేకరించి విశాఖలో కాపులుప్పాడకు తరలిస్తున్నారు. గతేడాది తాగునీరు, పరిశుభ్రంలో అనకాపల్లి జోన్ 5 స్టార్ రేటింగ్‌లో ఉండగా, ఈ ఏడాది మొదటి స్థానం వచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.



వేల్పులవీధిలో శుభ్రం చేస్తున్న కార్మికురాలు



శేఖవీధిలో చెత్త తరలిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు



చాకలిపేటలో డ్రైనేజీని శుభ్రం చేస్తున్న కార్మికుడు

- జోన్ పరిధిలో పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్‌లో 222 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.
- పట్టణ, జీవీఎంసీ విలీన గ్రామాల జనాభా సుమారుగా లక్ష 30 వేల మంది నివసిస్తున్నారు.
- జోన్ పరిధిలో 27 సచివాలయాల పరిధిలో 5 వార్డు కార్పొరేటర్లు ఉన్నారు.
- పట్టణంలో సేకరించిన చెత్తను విశాఖకు నాలుగు భారీ వాహనాల్లో నిత్యం తరలిస్తున్నారు.
- 5 వార్డుల కార్పొరేటర్లు పరిధిలో 27 క్లీన్ ఆంధ్రప్రదేశ్ వాహనాలు ద్వారా నిత్యం తడి, పొడి చెత్త సేకరిస్తున్నారు.
- ప్రధానమైన కాలువల్లో చెత్తను తొలగించేందుకు రెండు పెద్ద జేసీబీలు నిత్యం జోనల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయి.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్ కోసం కృషి



గతేడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తాగునీరు, పారిశుద్ధ్యంలో జోన్ 5స్టార్ రేటింగ్‌లో నిలిచింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలి. పారిశుద్ధ్య కార్మికులు వచ్చినప్పుడు మాత్రమే తడి, పొడి చెత్తను అందజేయాలి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఫీడ్‌బ్యాక్‌లో ప్రతి ఒక్కరూ వారి అభిప్రాయాలను నమోదు చేసి జోన్ అభివృద్ధికి కృషి చేయాలి.

– ఎస్.వెంకటరమణ, జెడ్సీ అనకాపల్లి

సికింద్రాబాద్‌లో రైలెక్కి.. విశాఖలో అదృశ్యం

తాటిచెట్లపాలెం(విశాఖ): పాలిటెక్నిక్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని తండ్రి మందలించడంతో హైదరాబాద్‌కు చెందిన బాలుడు ఇంట్లో చెప్పకుండా విశాఖపట్నం వచ్చేసి.. అదృశ్యమయ్యాడు. విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలివీ.. నేరేడ్‌మెట్(హైదరాబాద్)కు చెందిన గోవర్ధన్.. కుమారుడు కె. రోహన్ రాజు(17)ను మందలించడంతో సికింద్రాబాద్‌లో రైలెక్కి ఈ నెల 4న విశాఖపట్నంలో దిగాడు. ఇక్కడ నుంచి వేరే వారి సెల్‌ఫోన్ నుంచి తన ఫ్రెండ్‌కు ఫోన్ చేసి విశాఖ వచ్చినట్లు చెప్పాడు. అతను బాలుడి తండ్రి విషయం చెప్పాడు. వెంటనే రోహన్ కోసం కుటుంబ సభ్యులు గాలించారు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో గురువారం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోహన్ ఇంటి నుంచి బయలు దేరినప్పుడు క్రీం కలర్ టీషర్ట్, డార్క్ బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, చామన చాయ రంగు, సన్నగా ఉంటాడని తండ్రి తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు గవర్నమెంట్ రైల్వేపోలీస్ స్టేషన్‌లో గానీ, సబ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావుకు 98664 13487గానీ తెలియజేయవచ్చు.

తడిసిముద్దయిన అనకాపల్లి పట్టణం

- 57 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- లోతట్టు ప్రాంతాల జలమయం

అనకాపల్లి టౌన్: ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతో అనకాపల్లి పట్టణం తడిసి ముద్దయింది. వారం రోజులుగా తీవ్ర ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు గురువారం సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు. సుమారు గంటన్నరపాటు కురిసిన వర్షంతో 57 మిలీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలకు వరి నారుమడులు విస్తారంగా వేసి రైతులకు ఈ వర్షం మేలు చేస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. స్థానికంగా పలు లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరింది. చోడవరం -అనకాపల్లి రహదారిలో స్థానిక రైల్వేబ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోయింది. భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రహదారికిరువైపులా సబ్‌వేల గుండా ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగించగా, లక్ష్మీదేవిపేట రైల్వేక్రాసింగ్ మీదుగా భారీ వాహనాలను ట్రాఫిక్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో సిబ్బంది దారి మళ్లించారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌తోపాటు గవరపాలెం పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. జీవీఎంసీ కార్యాలయ రహదారిలో టాక్సీస్టాండ్ రహదారిపై వర్షపునీరు నిలిచిపోయింది. నర్సింగరావుపేట టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధి, బాలాజీదాస్ వీధి, సాయిబాబా మందిరం ముందు, వెనుకవీధులు వర్షపునీటిలో చిక్కుకున్నాయి. ఆయా ప్రాంతాల్లో వర్షపు నీటిలో నడిస్తే ఎటువంటి వ్యాధులు సంక్రమిస్తాయోననే భయాందోళన మొదలైంది. ఇక్కడ రహదారికిరువైపులా డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగుతో పాటు వర్షపునీరు రహదారిపై చేరింది.




నర్సింగరావుపేట సాయిబాబా ఆలయ వీధిలో నిలిపోయిన వర్షపునీటిలో ఇక్కట్లు

వర్షంతో రైతుల్లో ఆనందం

కె.కోటపాడు: మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడ్డ ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో సేద తీరారు. వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో ఎండ కాస్తుండడంతో వరి నారుమడులు వడలిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. మెట్ట ప్రాంత గ్రామాల్లో కూరగాయల పంటలతో పాటు వరి నారుమడులకు, నాట్లు వేసిన పొలాలకు కురిసిన వర్షంతో మేలు కలగనున్నట్లు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కె.కోటపాడు, చౌడువాడ, గొండుపాలెం, పాచిలవానిపాలెం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

అప్పల బాధ భరించలేక ఆత్మహత్య

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంకు చెందిన రైతు అనంతరావు గురువారం పొలాల్లో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి నుంచి పొలానికి వెళ్లిన అతడు ఎంతకీ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబీకులు అక్కడకు వెళ్లి పరిశీలించగా, అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది.

అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించడంతో ఆయన కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. అప్పుల బాధ భరించలేకే తన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డారని కుమారుడు బాలాజీ వాపోయాడు. అతడి ఫిర్యాదు మేరకు సీఆర్పీ 174 కింద కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

లేగదూడల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ

చోడవరం రూరల్: రైతులు లేగదూడల పెంపకంలో శ్రద్ధ చూపాలని, దానికి తగినన్ని తల్లిపాలు అందించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి రామ్‌మోహన్‌రావు తెలిపారు. లేగదూడల ఉత్పత్తి పథకంలో భాగంగా మండలంలోని ఖండేపల్లిలో గురువారం రైతులకు లేగదూడల సంరక్షణ పట్ల అవగాహన కల్పించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రసాదరావు, డిప్యూటీ డైరెక్టర్ కరుణాకరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ చిన్నంనాయుడులతో కలిసి రైతులకు పలు రకాల సూచనలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. దీంట్లో మేలైన లేగదూడల యజమానులకు బహుమతులను మందులు, విటమిన్ టానిక్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ శానాపతి రాజశేఖర్ సత్యారావు, ఎంపీటీసీ త్రినాథ్, చోడవరం మండల పశువైద్యాధికారులు టి.ప్రశాంతకుమార్, బి.లక్ష్మీలిఖిత, ఎ.అచ్యుతరామ్, బుచ్చియ్యపేట మండల పశువైద్యాధికారులు ఎస్.శివకుమార్, బి.రాము, ఉమామహేశ్వరి, డీఎల్డీఏ డాక్టర్ బి.సంధ్య, డీఏహెచ్‌వో డాక్టర్ పి.భాను బాబు పాల్గొన్నారు.



ప్రదర్శనలో బహుమతులు పొందిన లేగదూడలు

బహిర్భూమికి వెళ్లి యువకుడి మృతి

పాయకరావుపేట: మండలంలో నామవరం గ్రామానికి చెందిన గొర్ల వెంకటరమణ (37) బహిర్భూమికి వెళ్లి మృతి చెందినట్లు ఏఎస్‌ఐ గోవిందరావు గురువారం తెలిపారు. అతడు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడని, బుధవారం ఉదయం గ్రామ సమీపాన బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదన్నారు. దాంతో భార్య నూకరత్నం వెతకగా చాకలిరేవు వద్ద బహిర్భూమిలో చనిపోయినట్లు ఆమె ఫిర్యాదు చేసిందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



వెంకటరమణ మృతదేహం

22 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరు యువకుల అరెస్ట్

కె.కోటపాడు: మండలంలో పోతనవలస కూడలి వద్ద స్కూటీపై తరలిస్తున్న గంజాయిని ఎ.కోడూరు ఎస్‌ఐ బి.రామకృష్ణ గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ వాహన తనిఖీల్లో భాగంగా స్కూటీపై సంచితో అనుమానంగా ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులను ఆపి తనిఖీ చేయగా 22 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయిని తరలిస్తున్న విశాఖపట్నంకు చెందిన ఎన్.శివనాయుడు, సిహెచ్.పోతన రాకేష్‌లను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలు

నర్సీపట్నం: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే సంకల్పంతో భారత ప్రభుత్వం అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలను అందుబాటులో ఉంచిందని అనకాపల్లి డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ జె.ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. తపాలా శాఖ కార్యాలయ సిబ్బంది గురువారం పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా తపాలా శాఖ ద్వారా ప్రజలందరికీ రూ.25కే జాతీయజెండాను అందిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి పోస్టుమన్ స్వయంగా ఇంటికి తీసుకువచ్చి ఇస్తారన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. జాతీయ జెండాను ప్రజలకు అందించే భాగ్యం భారత ప్రభుత్వం తపాలా శాఖకు దక్కిందన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఐ.కుమార్, పోస్టు మాస్టర్ ఎం.సి.హెచ్. నాయుడు, తపాలా కార్యాలయం, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న తపాలాశాఖ సూపరింటెండెంట్ ప్రసాద్‌బాబు

15 ఏళ్ల తర్వాత మహిళ ఆచూకీ లభ్యం

హుకుంపేట : సంతరి పంచాయతీ చిన్నబురుగుపుట్టు గ్రామానికి చెందిన కంబ సత్యవతి అనే గిరిజన మహిళకు అరకులోయ మండలం చొంపి గ్రామానికి చెందిన సత్యారావుతో వివాహమైంది. ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. మతిస్థిమితం లేక 15 ఏళ్ల క్రితం రాజస్థాన్ వెళ్లిపోయిన సత్యవతి 15 ఏళ్లగా యాచకురాలిగా తిరుగుతోంది. ఆమె తెలుగులో మాట్లాడుతుండడంతో పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెది విశాఖ జిల్లా మన్య ప్రాంతం అని తెలుసుకుని పోలీసుల సహకారంతో హుకుంపేట మండల పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి గురువారం ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని నర్సింగబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారిపై విద్యుత్ కండక్టర్ మార్పు నున్న కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో నరసింగబిల్లి, జెట్టపురెడ్డి తుని, చింతలపాలెం గ్రామాల్లో ఇళ్లతోపాటు వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెట్టపాలెంలో 'గడప గడపకు' రేపు

అనకాపల్లిటౌన్: మండలంలోని మెట్టపాలెం గ్రామంలో శనివారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మనప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ప్రజాప్రతిధులు, ప్రభుత్వశాఖల అధికారులు, ఉద్యోగులు హాజరుకావాలన్నారు.

ఎన్టీపీసీ ఘటనపై విచారణకు డిమాండ్

అనకాపల్లి రూరల్: పరవాడలోని సింహాద్రి ఎన్టీపీసీ ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ప్రమాదంలో మరణించిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇప్పించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె లోకనాథం డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు.

టమాటా @ 100

కశింకోట: కశింకోటలో గురువారం జరిగిన వారపు సంతలో టమాటా ధర సగానికి తగ్గింది. గతవారం కిలో రూ.200 ఉండగా, ఈ వారం సగం మేర తగ్గి రూ.100కి విక్రయాలు సాగాయి. దీంతో ప్రజలు కాస్త ఊరట చెందారు. పాదుచిక్కుడు, ఆగాకర కాయల ధరలు మాత్రం కిలో రూ.150గా ఉన్నాయి. ఉల్లిపాయ రూ.25, బంగాళా దుంప, క్యాబేజీ రూ.30, క్యారెట్, బీట్రూట్, వంకాయ. దొండకాయ, బీన్స్ రూ.40, బెండకాయ, కాకరకాయ, బీరకాయ రూ.60, క్యాప్సికం, పచ్చిమిరప రూ.100కు అమ్మకాలు సాగాయి.

బోనస్ పెంపు కోరుతూ ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా

అనకాపల్లిటౌన్: ఎల్ఐసీ బోనస్ ధరలను పెంచాలని ఏవోఐ యూనియన్ జిల్లా అధ్యక్షులు గొర్లి శంకరరావు, వెన్నెల సన్యాసిరావులు డిమాండ్ చేశారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ముందు గురువారం ఈ ఇన్సూరెన్స్ పాలసీ, జీఎస్టీలను వ్యతిరేకిస్తూ ఏవోఐ యూనియన్ నేతలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెంట్ల ప్రొఫెషనల్ టాక్స్ రద్దు, ఆలస్యం రుసుంపై జీఎస్టీ అమలును వెనక్కి తీసుకోవాలన్నారు. యూనియన్ కోశాధికారి కరణం మాణిక్యాలరావు, సభ్యులు పెంటకోట సైదునాయుడు, పీలా శ్రీనివాసరావు, నడిశెట్టి అప్పారావు, కొణతాల నూక అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సేవలో రాజీలేని పోరాటం

అనకాపల్లి రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, వారికందిస్తున్న సేవల్లో యూటీఎఫ్ 50 ఏళ్లుగా రాజీలేని పోరాటం చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు వి.లక్ష్మి అన్నారు. యూటీఎఫ్ 50వ ఆవిర్భావ వేడుకల్లో గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నిరంతర సేవలందించడంతో పాటు వర్తమాన సామాజిక అంశాలపై ఎప్పటికప్పుడు ప్రజల్లో చైతన్యం తేవడంలో యూటీఎఫ్ తనదైన పాత్ర పోషిస్తోందన్నారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
భోళాశంకర్	: సత్యనారాయణ స్క్రీన్-1
సూర్య S/O కృష్ణన్	: సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	: షిర్డిసాయి
భోళాశంకర్	: పర్తిసాయి
భోళాశంకర్	: వెంకటేశ్వర
భోళాశంకర్	: శ్రీసత్య
బ్రో	: రామచంద్ర

చెరువులకు 'జల'సత్వాలు

కశింకోట మండలంలో పంటల సాగుకు ప్రధాన ఆధారం వర్షం, చెరువులే..! దీంతో మండలంలోని 21 చెరువుల్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమృత్ సరోవర్ పథకం నిధులతో, ఉపాధి పనుల ద్వారా వీటిని అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే మూడు చెరువుల అభివృద్ధి పూర్తయింది. మిగిలిన 18 చెరువుల అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి.

- అమృత్ సరోవర్‌లో 21 చెరువుల అభివృద్ధికి చర్యలు
- పనులు పూర్తయితే 1950 ఎకరాల ఆయకట్టుకు నీరు



జి.భీమవరం వద్ద ఉపాధి పథకంలో తవ్విన చెరువులో చేరిన నీరు



అమృత్ సరోవర్ పథకంలో చేపట్టిన ఆనందపురం చెరువులో చేరిన నీరు

కశింకోట: జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని వందలాది ఎకరాలకు సాగు నీరందించే 20కి పైగా చెరువులను అభివృద్ధి చేశారు. దీంతో ఆయకట్టుకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు సమృద్ధిగా అందగలదని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. సుమారు రూ.కోటి 30 లక్షల అంచనా వ్యయంతో పనులు ఈ జరుగుతున్నాయి. అమృత్ సరోవర్ పథకం కింద మూడు చెరువులను ఇప్పటికే పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. మరో 18 చెరువులను అభివృద్ధి చేస్తున్నారు.

చెరువలే సాగుకు ఆధారం

మండలంలోని పలు గ్రామాల రైతుల సాగు భూములకు చెరువు నీరే ప్రధాన ఆధారం. వర్షాకాలం నీటిని చెరువుల్లో నిల్వ చేసి, ఆ నీటితోనే వరి, చెరకు, కూరగాయలు తదితర పంటలను సాగు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో మండల గ్రామాల్లోని 21 చెరువుల్లో పూడికతీత, అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో తీడ, ఈ.చౌడువాడ, సుందరయ్యపేట గ్రామాల్లోని చెరువుల్ని అమృత్ సరోవర్ పథకంలో ప్రత్యేకంగా పనులు చేపట్టి, పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. ఈ చెరువుల్లో పూడిక తొలగింపుతోపాటు, రక్షణ గట్లను పటిష్టం చేశారు. మదుంలకు మరమ్మతులు చేపట్టారు. తీడ, ఈ చౌడువాడ చెరువు గట్లపై కొబ్బరి, నేరేడు వంటి మొక్కల పెంపకాన్ని కూడా చేపట్టారు. సుందరయ్యపేట చెరువుపై మొక్కలు వేయాల్సి ఉంది. ఈ చెరువుల్లో ఇటీవల కురిసన వర్షాలకు నీరు కూడా చేరింది. వీటి కింద ఉన్న సుమారు 350 ఎకరాలకు సాగు నీరు అందనుండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తుది దశకు అభివృద్ధి పనులు

మిగిలిన 18 సాగునీటి చెరువుల మరమ్మతు పనులను కూడా ఉపాధి పథకంలో చేపట్టారు. ఉగ్గినపాలెం, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని, నూతలగుంటపాలెం, ఏఎస్ పేట, పరవాడపాలెం, జమాదులపాలెం, అచ్చెర్ల, జి.భీమవరం, చెరకాం, బయ్యవరం తదితర గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. చెరువుల నుంచి తీసిన మట్టితో గట్లను పటిష్టం చేస్తున్నారు. పనులు దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇటీవల తుపాను వర్షాల వల్ల పనులకు కాస్త బ్రేక్ పడింది. వీటిని పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇవి కూడా పూర్తయితే ఈ చెరువుల కింద ఉన్న సుమారు 1,600 ఎకరాల ఆయకట్టు భూములకు పుష్కలంగా సాగునీరు అందగలదని అధికారులు చెప్తున్నారు.

> **అమృత్ సరోవర్‌తో చెరువుల అభివృద్ధి**
>
> మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 21 చెరువులను అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే తీడ, ఈ చౌడువాడ, సుందరయ్యపేట చెరువుల్ని అమృత్ సరోవర్ పథకం కింద రూ.42 లక్షలతో అన్ని విధాలుగా అభివృద్ధి చేశాం. మరో 18 సాగు నీటి చెరువులను కూడా సుమారు రూ.90 లక్షలతో అభివృద్ధి చేస్తున్నాం. దాదాపు 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన పనులు కూడా పూర్తి అయితే 1600 ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందగలదు. వేగంగా వీటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
>
> –శివ, ఏపీవో, జాతీయ ఉపాధి హామీ పథకం, కశింకోట

వలంటీర్ వ్యవస్థపై ఆరోపణలు ప్రతిపక్షాల కుట్ర

- రూ.20 లక్షలతో శారదానదిపై వంతెన నిర్మాణానికి ఆదేశాలు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



తగరంపూడిలో గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి అమర్‌నాథ్



వృద్ధురాలిని ప్రభుత్వ పథకాల గురించి అడుగుతున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్: సీఎం జగనన్న ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గురువారం మండలంలోని తగరంపూడి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం ఆయా కుటుంబాలకు చేకూర్చిన సంక్షేమ లబ్ధిని గ్రామస్తులకు వివరించారు. వారికి ఎంత మేర లబ్ధి చేకూరిందో తెలిపే వివరాలతో ముద్రించిన బ్రోచర్లను అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేకూరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి తావు లేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో శారదానదిపై ఉన్న వంతెన దెబ్బతిని, ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వంతెన మరమ్మతులు, పునర్నిర్మాణ పనులకోసం రూ.20 లక్షలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న మురుగు కాల్వ నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.

గ్రామంలో ఇంటింటికీ తిరుగుతున్న సమయంలో ఓ ఇంటి వద్ద రమణమ్మ అనే వృద్ధురాలితో అవ్వా.. నీకు ప్రతి నెలా ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ సక్రమంగా అందుతోందా? అని మంత్రి ఆరా తీశారు. నెలనెలా సరిగ్గా ఒకటో తేదీన ఠంచనుగా పింఛన్ అందుతోందని, తమ వలంటీర్ ఇంటికే వచ్చి పింఛన్ సొమ్ము చేతికిస్తున్నారని వృద్ధురాలు బదులిచ్చింది. ఈ వయసులో మమ్మల్ని పట్టించుకుని, ఆర్థికంగా ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని పలువురు మంత్రికి తమ సంతృప్తిని తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ఎంతో సమర్థవంతంగా పనిచేస్తుంటే ప్రతిపక్ష నేతలు మాత్రం లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆక్షేపించారు. ఇదంతా ప్రతిపక్షాల కుట్ర అని పేర్కొన్నారు. గ్రామాలు, వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సేవల్ని అందిస్తున్న వలంటీర్లపై అక్కసు వెళ్లగక్కుతున్న నేతలపై విమర్శలు గుప్పించారు.

కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, మళ్ల బుల్లిబాబు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, పి.గోవిందు, వైస్ ఎంపీపీ ఐతా రాము, తగరంపూడి గ్రామ సర్పంచ్ యాదగిరి అప్పారావు, యాదగిరి రామచంద్రరావు, మొల్లి అప్పారావు, ఎంపీడీవో కేవీ నరసింహారావు, గ్రామీణాభివృద్ధిశాఖ ఏపీఎం నీలాచలం, పలువురు అధికారులు, వలంటీర్లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొలగించిన నిర్మాణాలకు నష్టపరిహారం



గృహ యజమానులకు చెక్కును అందిస్తున్న జెడ్పీ వెంకటరమణ, జాజుల రమేష్

అనకాపల్లిటౌన్: పట్టణంలోని పెరుగుబజారు–రైల్వేస్టేషన్ రహదారి విస్తరణకు సహకరించిన 24 మంది గృహ యజమానులకు స్థానిక జీవీఎంసీ కార్యాలయంలో రూ.25 లక్షల చెక్కును జెడ్సీ పి.వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్‌లు గురువారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ యజమానుల సహకారంతోనే ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రహదారి విస్తరణకు మార్గం సుగమమైందన్నారు. భవిష్యత్ అవసరాల మేరకు నూతన రహదారి నిర్మాణానికి ముందుకొచ్చి, ప్రభుత్వ నష్ట పరిహారానికి అంగీకరించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి జనార్దనరావు, గృహయజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా 'నా భూమి - నా దేశం'



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో నర్సింహం

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ కలగా లక్ష్మి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని ఆమె కోరారు. సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో వి.వి.రవి కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మార్టూరులో..

అనకాపల్లిటౌన్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా ఈ నెల 15 వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.వి.నరసింహం, ఎంపీపీ గొర్లి సూరిబాబులు తెలిపారు. మండలంలోని మార్టూరు గ్రామంలో గురువారం నిర్వహించిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో పాల్గొని, నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనమంటూ గ్రామంలో మొక్కలు నాటారు. అంతకుముందు అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ రెవెన్యూ నాయుడు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు పాల్గొన్నారు.

శారీరక, మానసిక ఆరోగ్యంతో ఆనందం



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

అనకాపల్లిటౌన్: నేటి సమాజంలో వ్యక్తిగత శ్రేయస్సుకు శారీరక, మానసిక ఆరోగ్యం ఆవశ్యకతను ప్రతి వ్యక్తి తెలుసుకోవాలని ఆధ్యాత్మిక, యోగా గురువు కె.శ్రావణ్‌కుమార్ సూచించారు. స్థానిక డైట్ కళాశాల ఆవరణలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్(జీ20), రాజయోగ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మానసిక ఆరోగ్యం–శ్రేయస్సు అనే అంశంపై ఆవగాహన సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శారీరక ఆరోగ్యం, మానసిక శ్రేయస్సు మధ్య సంక్లిష్ట సంబంధానికి గల వ్యత్యాసాలను వివరించారు. ఆరోగ్యకరమైన శరీరం, ఆరోగ్యకరమైన మనసుకు దోహదపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ సమతుల్య విధానాలను పాటించడం ద్వారా సమాజంలో ఆరోగ్యంగా, సంతోషంగా జీవించవచ్చన్నారు. మానసిక ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కొనేందుకు ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అకడమిక్స్ డీన్ కె.పార్వతి, డీఎల్‌సీసీ కో ఆర్డినేటర్ మైత్రి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు.

తగరంపూడి వంతెన నిర్మాణానికి వినతి



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి రూరల్: తగరంపూడి మెయిన్ రోడ్డులో శిథిలావస్థకు చేరుకున్న వంతెన నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పరిశీలకుడు దాడి రత్నాకర్ ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, డీఈ ధనుంజయలకు గురువారం వినతి పత్రం అందించారు. మండలంలోని తుమ్మపాల నుంచి కూండ్రం వెళ్లే దారిలో తగరంపూడి వద్ద ప్రధాన రహదారిపై వున్న ఈ వంతెన పూర్తిగా కుంగిపోయిందన్నారు. రోజూ ఈ వంతెనపై నుంచి వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, జగన్నాథపురం, మెట్టపాలెం, చాకిపల్లి, రామజోగిపాలెం తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, బరువైన వాహనాలు వెళ్లే సమయంలో ప్రమాదం జరగవచ్చున్నారు. వంతెన పూర్తిగా కూలిపోకముందే, కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని రత్నాకర్ కోరారు. ఆయన వెంట బొడ్డపాటి చిన్న రాజారావు, పాలకపాటి రాజాబాబు, నందవరపు కుమార్, దాడి రాము, నంబరు రమణ, ఇంటి త్రినాథ్, నాగభూషణం, వమ్మి శ్రీను, కోటిపల్లి శ్రీను, ఆడారి రవికుమార్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికే పంచాయతీ నిధులు

అనకాపల్లిటౌన్: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనలో భాగంగా 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టాలతో కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణరాజు అన్నారు. గ్రామాల అభివృద్ధికి కేటాయించిన నిధులను, గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి అక్కడి ప్రజల అభీష్టం మేరకు ఖర్చు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. నెహ్రూచౌక్‌లో బీజేపీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు గ్రామ సర్పంచ్ నిధులపై గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధికి కేంద్రం నేటి వరకు రూ.8 వేల కోట్ల నిధులు మంజూరుచేయగా, అందులో కేవలం రూ.వెయ్యి కోట్లను మాత్రమే గ్రామాలకు కేటాయించినట్లు ఆరోపించారు. మిగిలిన నిధుల్ని తక్షణమే గ్రామాల అభివృద్ధికి వెచ్చించాలని డిమాండ్‌చ ఏశారు. అనంతరం నెహ్రూచౌక్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చెపట్టారు. సభాధ్యక్షుడు ఈర్లె శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి ఎనిమిరెడ్డి మాలకొండయ్య, అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు, రాష్ట్ర పంచాయతీల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎరుకునాయుడు, పార్టీ సీనియర్ నేతలు తోట నగేష్, జీవీ సత్యనారాయణ, చదరం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులి పురుగుల నివారణ



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



కశింకోట బాలికల హైస్కూల్లో మాత్రలను మింగిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు

అనకాపల్లిటౌన్: నులి పురుగుల బారిన పడిన పిల్లలు రక్తహీనతకు గురై, ఆహారం సరిగా తీసుకోక ఇబ్బందులు పడతారని, వీటి నుంచి తప్పించుకునేందుకు ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గోపాలపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన నీటిని తాగాలని, మలవిసర్జన తర్వాత చేతుల్ని సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, ఆహారం తీసుకునే సమయంలో చేతుల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యవంతులైన 1 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు పిల్లలు ఎవరైనా ఈ మాత్రల్ని వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, ఉపాధ్యాయులు, ఏఎస్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గురువారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించి, 93 శాతం మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి, మింగించారు. కశింకోట పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లోని 12,394 మంది విద్యార్థులుండగా వారిలో 11,509 మందికి, తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో సుమారు 7 వేల మందికి ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. మిగిలిన వారికి ఈ నెల 17న మాత్రలు అందించనున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు.

- స్థానిక బాలికల హైస్కూల్లో వైద్యాధికారి తిరుపతిరావు మాత్రలను పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద, హెచ్ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి, పీడీ పి.కమల, ఉపాధ్యాయ సిబ్బంది, వైద్య ఆరోగ్య విస్తరణాధికార్లు సత్యనారాయణ, సత్యవతి, సూపర్‌వైజర్లు రామమూర్తి, ప్రకాష్, సుభాని, రామకృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.
- తాళ్లపాలెం హైస్కూల్లో వైఎస్సార్ సీపీ మండల సచివాలయాల కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు నులిపురుగుల నివారణ మాత్రలు విద్యార్థులతో మింగించారు. ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి భవాని, అద్దంకి సతీష్, హెచ్ఎం విజయలక్ష్మి సుమన్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, ఉపాధ్యాయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లిటౌన్: స్థానిక కోట్నివీధి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ హాజరై చిన్నారులచే ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూల్, ప్రైవేట్ స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశబూరు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై మెడికల్ ఆఫీసర్ షబ్నం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎస్కే నజ్రత్ షమీమ్, ఎంపీహెచ్ఈవో జమ్ము శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో కె.శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పన్నీరు వెంకటలక్ష్మి, చంటి, హైస్కూల్ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోస్టల్ ఉద్యోగుల ధర్నా



పోస్టల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లిటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ స్థానిక ఉడ్‌పేట ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట గురువారం పోస్టల్ ఉద్యోగులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్, జాతీయ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ జాయింట్ కమిటీ డివిజనల్ కార్యదర్శి వి.దుర్గాప్రకాష్ మాట్లాడుతూ 8 గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ జేడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీస్‌కు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి, ఆర్థిక ఉన్నతి కల్పించాలని కోరారు. అంతకు ముందు సూపరింటెండెంట్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నూకరాజుదొర, పి.సతీష్, శ్రీధర్, పి.వీరునాయుడు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కశింకోట: కశింకోట ప్రాంతంలో గురువారం సాయంత్రం చల్లని గాలులతో మొదలై, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఆకాశంలో దట్టమైన మేఘాలు ఆవరించి, వాతావరణ ఆహ్లాదకరంగా మారింది.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనాలు నడిపేటపుడు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనం నడిపేవారు సీటు బెల్టు ధరించాలని నినాదాలు చేశారు. ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి భవాని, అద్దంకి సతీష్, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, పార్టీ నాయకుడు ఇందల మునిలినాయుడు, వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఎం విజయలక్ష్మి, సీసీ రామకృష్ణ, వీవోఏలు భ్రమరాంబ, చిట్టి, రూప, పీసీ గీత పాల్గొన్నారు.

ఆస్పత్రికి కుర్చీలు, కూలింగ్ వాటర్ క్యాన్ వితరణ

అనకాపల్లిటౌన్: 80వ వార్డు గవరపాలెం పల్లపువీధి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కొణతాల మురళీకృష్ణ 12 కుర్చీలు, ఒక కూలింగ్ వాటర్ క్యాన్‌ను అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి జయవీర్ జన్మదిన వేడుకల్లో భాగంగా గురువారం వీటిని ఆస్పత్రి సిబ్బందికి అప్పగించారు. జన్మదిన వేడుకల పేరిట అనవసర ఖర్చుకు బదులు, ఆ మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించాలని పేర్కొన్నారు. ఆస్పత్రి వైద్యురాలు షమీమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు విల్లూరి శేఖర్, సన్యాసినాయుడు, శంకర్, పెట్ల నాగేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.